యమలోక యాత్ర

యమ్.యస్.ఆర్.వి. కృష్ణారావు

వెంకట్రావు చచ్చిపోయాడు. కొరవ లేకుండా పూర్తిగా చనిపోయాడు. అతని శవాన్ని పోలీసులు తీసుక పోతున్నారు. వెంకట్రావు ఆత్మ దిగులుతో ఆ దేహం వెంబడే వెళ్లసాగింది. అతని దిగులుకు కారణం; ఈ పోలీసులు అందరిలా తను ధరించిన దేహాన్ని ఖననం చెయ్యరు, లేక పోతే కాల్చరు. దాన్ని డాక్టర్ దగ్గరకు పంపి ఏ ముక్కకా ముక్క కోసి, ముక్కలు ముక్కలు చేసి, ఆ ముక్కలను మళ్లీ కుట్టి, నూనెలో పెట్టి, శవాల రూము లోకి నెట్టి తరువాత బూడిద చేస్తారు. ఇదంతా తలుచుకుంటుంటే అతనికి బాధగా ఉంది. తను అల్లారు ముద్దుగా 25 సంవత్సరాలు అద్దెకు తీసుకున్న ఆ యింటిని అలా ముక్కలు చేస్తుంటే అతని అంతరాత్మ (అంటె అతనే) ముక్కలు ముక్కలుగా నరికి వేయబడ్డట్లు ఫీలయినాడు. తను ఆ అద్దె శరీరానికి ఎంత రిపేరు చేశాడు! ఎన్నిసార్లు సబ్బులేసి తోమాడు! ఎంత శుభ్రంగా ఉంచాడు! ఎన్ని రకాల బట్టలు తొడిగాడు! అన్నీ తలుచుకుంటే వెంకట్రావు ఆత్మ విలపించింది. మళ్లీ ఆ శరీరంలోకి దూరాలనుకున్నాడు. కాని ఎక్కడా సందు కనిపించలేదు తాను శరీరంలోంచి ఎలా బయటకు వచ్చిందీ గుర్తు లేదు శరీరంలోకి దూరాలని ఎంత ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. చేసేది లేక పోలీసుల వెంబడి; అద్దె కొంప వెంబడీ వెళ్ళసాగాడు. మధ్య దార్లో పోలీసులు తనను గురించి ఏదో మాట్లాడు కుంటున్నారు. వాళ్లు ఏం మాట్లాడుకుంటున్నారో శ్రద్ధగా వినాలని, చెవులు రిక్కించి వాళ్ల మాటలు వినసాగాడు.

'మన ఖర్మ కాలి సబ్ఇన్‌స్పెక్టర్ ఈ శవాన్ని మన మెడకు తగిలించారు. దీనితో ఎంత గొడవపడాలి. ఎన్ని కష్టాలు. వీడు చావటం కాదుకాని మనల్ని చంపుకు తింటున్నాడు. వీణ్ని తగలబెట్ట!' అనా డొక పోలీసు.

అతను అన్ని తిట్టినా ఆ చివరి మాటలు వెంకట్రావుకు అమృతప్రాయంగా తోచాయ్. తనకు కావలసింది అదే. తన దేహాన్ని ఎండబెట్టకుండా తగలబెట్టటం.

'అయినా ఆత్మహత్య చేసుకుండే వెధవ ఏ నిర్మానుష్యమైన ప్రదేశంలోనో చేసుకోక మన దుంప తెంచటానికి మునిసిపాలిటీ పార్కు బావిలోనే పడి చావాలా! ఇప్పుడు వీడితో మనకు ఎంత పేచీ వచ్చి పడింది. ఈ ఆత్మహత్య చేసుకునే వాళ్లంతా ఇంతే! హాయిగా ఏ అరణ్యాలకో పోయి చావక పట్టణాలలో చచ్చి మన దుంప తెంచుతున్నారు.' అన్నాడు రెండో పోలీసు.

వెంకట్రావు పొట్టనుండి గొంతు వరకు ఆగ్రహంతోను మెదడంతా ఆశ్చర్యంతోనూ నిండిపోయాడు. తను ఆత్మహత్య చేసుకున్నాడా? అంతా అబద్ధం. తను దైవఘటన వలన చనిపోయాడు. నిజంగా మాట్లాడితే దేవుడే తనను హత్య చేశాడు. తను హత్య (దేవుని చేత) చేయబడితే వీళ్లు ఆత్మహత్య అంటారేమిటి? వీళ్లేమన్నా తాగి ఉన్నారా? తనకు వీలైతే వాళ్లిద్దర్ని చచ్చేంత వరకు తందామనుకున్నాడు. కాని తనకా శక్తి లేదుగా! కారణం తనే చచ్చి పోయాడు.

తరువాత నిజం ఆలోచించేసరికి అతనికి, వాళ్లమీద ఆగ్రహం పోయి జాలి కలిగింది అవును పాపం, వాళ్లకు మాత్రం ఏం తెలుసు. ప్రమాదవశాత్తు చనిపోయానని? మొన్నటి వరకూ నిరాశతో తిరిగిన తను ఇవాళ భావిలో పడి చచ్చిపోయాడంటే ఆత్మహత్య కాక మరేమనుకుంటారు? అసలు తను ఆత్మహత్య చేసుకున్నానని తన స్నేహితులే వాళ్లకు

చెప్పారు. వాళ్ళ మాటలను విళ్ళు నమ్మారు.

అయినా వాళ్ళు చెప్పగానే నమ్మటమేనా? నిజం విచారించ నక్కర్లేదా? తనను గురించి పూర్తిగా తెలుసుకుంటే తను ప్రమాదవశాత్తు చనిపోయాడో లేక ఆత్మహత్య చేసుకున్నాడో వాళ్ళకు తెలిసేది. అసలీ పోలీసులలో చాలా మంది ప్రజలేది చెపితే అది గట్టిగా నమ్ముతారు

ఆస్పత్రి గేటు దగ్గరకు వచ్చింది జీపు ఆస్పత్రి గేటువద్ద నుండి భవనానికి సుమారు మూడు ఫర్లాంగుల దూరముంటుంది. ఆ భవనానికి వెనకవైపే స్మశానం ఉంది. భవనానికి దారితీసే ఆ రోడ్డుకు డాక్టరు 'సేఫ్టీరోడ్' అని పేరుపెట్టాడు. కాని కొందరు దుండగులు దానికి 'ఒన్వే ట్రాఫిక్ రోడ్' అని నామకరణం చేశారు వాళ్ళ ప్రచారంవల్ల తేలిన సారాంశం ఏమిటంటే ఆ ఆస్పత్రిలోకి రోగులు పోవడమే కాని తిరిగిరావడమంటూ ఉండదు ఎందుకంటే, ఆస్పత్రికి వెనుకవైపే స్మశానం ఉందికదా !

తన శరీరాన్ని ఆ డాక్టరు దగ్గరకు తీసుకు వెళుతున్నారని తెలియగానే వెంకట్రావుకు దిగులేసింది పడక పడక ఈ డాక్టరు చేతుల్లోనే పడ్డాను అనుకున్నాడు. అసలు ఇటువంటి డాక్టరును గవర్నమెంటు డాక్టరుగా ఎలా నియమించారా అన్న పెద్ద సందేహమొచ్చింది కాని ఇప్పుడెన్ని సందేహాలు వస్తేమాత్రం ఏంలాభం? చేసేదిలేక యథాప్రకారం శరీరాన్ని అనుసరించ సాగాడు. లోపలికి వెళ్ళగానే వెంకట్రావుకు ఒక కొత్త వార్త తెలిసింది. డాక్టరు ఆ ఉదయం ఊరికి వెళ్ళాడుట. ఇంకో గంటలో రావచ్చు !

అంటే తనశరీరం ఇంకొక నాలుగు గంటలలో బూడిద కాబోతున్నది. ఇంకా 240 నిమిషాలు మాత్రమే టైముంది. ఉద్యోగంచేస్తూ, పెళ్ళిచేసుకొని హాయిగా కాలం గడపవలసిన తను ఇలా అర్ధంతరంగా ఎందుకు చనిపోయాడు. ఆ ఊహ మనస్సులో మెదలగానే వెంకట్రావుకు మళ్ళీ బ్రతకాలనిపించింది. ఎలాగైనా సరే యమధర్మరాజును ఒప్పించి మళ్ళా బ్రతకాలి

ఇలా ఆలోచిస్తూ తిరుగుతున్న వెంకట్రావుకు దూరాన్నించి ఇద్దరు వ్యక్తులు తనను చూస్తూ, తనవైపే వస్తున్నట్లు కనబడ్డారు. వెంకట్రావుకు బోలెడంత ఆశ్చర్యం ముంచుకొచ్చింది—తను రూపంలేనివాడు కదా ? తనను ఎవ్వరూ మానవులు చూడలేరే ! వీళ్ళలా చూస్తున్నారు ? అనుకున్నాడు ఆ ఇద్దరినీ తేరిపార చూశాడు. ఇద్దరూ నల్లని వికారమైన దుస్తుల్లో ఉన్నారు. ఇద్దరి తలపైనా కొమ్ములున్నాయ్. ఇద్దరి చేతుల్లోనూ పూర్వం రాజుల దగ్గరుండే ఆయుధాల్లాంటివి ఉన్నాయ్ బాగా దగ్గరకు వచ్చిన వాళ్ళను చూశేసరికి అతను ఝల్లుమన్నాడు వాళ్ళు యమదూతలు. తనను తీసుక వెళ్ళటానికి వచ్చారు. నరకానికి తీసుకు వెళ్ళటానికి వచ్చారు వెంకట్రావు తనకు తాను ధైర్యం చెప్పుకున్నాడు ధైర్యంగా ఉండాలనుకున్నాడు 'ధైర్యే, సాహసే ప్రాణః' అనుకున్నాడు.

'ఏయ్ అబ్బాయ్! నీపేరేనా వెంకట్రావు' అనడిగారు వాళ్ళు.

'అవును' ధైర్యంగా చెప్పాడు.

'నీ కోసం ఊరంతా గాలించి చచ్చాం. కాదు కాదు వచ్చాం. నువ్విక్కడున్నావా? అయినా చచ్చినవాడివి చచ్చినచోటే ఉండక ఊరంతా తిరగటం దేనికి ! బుద్ధిలేదు' అన్నారు వాళ్ళు

వెంకట్రావుఆత్మ ఆగ్రహంలో మునిగిపోయింది. ఎంత చస్తేమాత్రం ఇంత మాటంటారా ! వాళ్ళను నమిలేశాలా చూశాడు. ఆత్మ వేడెక్కిపోయింది. బుసకొట్టసాగాడు అదేమాట ఈ లోకంలో అంటే, వాడెంత పెద్ద ఆఫీసరైనా సరే మనంచేసింది తప్పయినాసరే వాడిచేతక్షమాపణ చెప్పిస్తాం కాని వీళ్ళు యమభటులుకదా అనుకున్నాడు వెంకట్రావు అందుకని తన కోపాన్ని తనలోనే ఇముడ్చుకున్నాడు. అందుకని శాంతంగా మాట్లాడాడు.

'మీరు నాకోసం వెతికారు బాగానే ఉంది కాని కనపడకపోతే అది నాదోషం కాదు మీ దోషమే. ఎందుకంటే మీ డ్యూటీయే వెదకటంకదా'.

ఆ ఇద్దరూ క్వొశ్చన్ మార్కు మొహాలేశారు

'ఎందుకలా చూస్తారు. నేనడిగిన దానికి జవాబు చెప్పరేం' కొంచెం కోపంగా అడిగాడు.

ఈ సారికోపం యమదూతల వంతైంది. ఈ నరమానవుడు మనల్ని గద్దించి అడుగుతున్నాడే! వీడికెంత ధైర్యం. అయినా అతనడిగిన ప్రశ్న వీళ్ళకు అర్థంకాలేదు. వాళ్ళు తమ పని మరిచిపోయి అతడడిగిన ప్రశ్నకు అర్థం ఏమిటో తెలుసుకోవాలన్న ఆదుర్దా పడసాగారు.

'నీవడిగిన ప్రశ్న మాకు కొద్దిగా అర్థం కాలేదు. అందులో డ్యూటీ అన్నావే. దానికి అర్థం ఏమిటి?' అన్నారు.

'డ్యూటీ అంటే తెలియదా? అది ఆంగ్ల భాష. దాని అర్థం మీరా పని చచ్చిన వాళ్ళను పైకి తీసుకుపోవడమే కదా! మీరా పనే మీరు చెయ్యటానికి ఇంత బద్ధకమా ఇదే ఈ లోకంలో ఐతే పెనాల్టీ వేస్తారు.'

ఆ మాటలో వాళ్ళకు కోపంతోపాటు వాళ్ళ డ్యూటీ గుర్తుకు వచ్చింది.

'మా పనేమిటో మాకు తెలుసు. నీవు నోరుమూసుకుని రాతోరా!' అని జబ్బ పట్టుకున్నారు

ఇంక తనపని ఆఖరనుకున్నాడు వెంకట్రావు. అయినా చివరిసారిగా వీళ్ళెంత ధైర్యవంతులో చూడాలనుకున్నాడు. జబ్బ పట్టునుండి విడిపించుకుంటూ, ధైర్యంగ,

'రాకపోతే ఏం చేస్తారు' అని అడిగాడు.

యమదూతలు కొద్దిగా భయపడ్డారు. వీడి వాలకంచూస్తే తన్నేట్టున్నాడు వాళ్ళు ఈ పూరికి కొత్త వెంకట్రావు వాళ్ళ లెక్కలో నాలుగవవాడు ఇదవరకటి ముగ్గురు ముసలివాళ్ళు. తమను చూడగానే అదిరిపోయి తాము ఏం చెప్తే అది చేశారు. వీడు కొంచెం పెడసరంగా ఉన్నాడు. ఏం చెప్పాలో వాళ్ళకు తోచలేదు.

వాళ్ళ మనసులోని భావాలను ముఖంపై చూచిన వెంకట్రావుకు వాళ్ళ మనస్తత్వం పూర్తిగా తెలిసింది. వీళ్ళు పేరుకు మాత్రం యమదూతలేకాని పిరికివాళ్ళు. తను బెదిరిస్తే లొంగుతారు. అయినా తన అదృష్టమో, ఖర్మమోగాని తనకు అందరూ డ్యూటీ సరిగా చెయ్యలేని వాళ్ళే చిక్కుతున్నారు. ఆ పోలీసులూ అంతే. వీళ్ళు అంతే. వీళ్ళను ఒక ఆట ఆడించాలనుకున్నాడు.

'ఏం! చెప్పరేం! రాకపోతే ఏం చేస్తారు'

ఈ సారి జబర్దస్తీగానే అడిగాడు.

'ఏం చేస్తావూ! ఈడ్చుకొని లాక్కు వెళతాం' బింకంగా అన్నారిద్దరూ.

'నేను మీకు చిక్కితేగదా' పరుగు పుచ్చుకొన్నాడు వెంకట్రావు యమదూతలు ఒక్కక్షణంపాటు తెల్లబోయి వెంబడి బడసాగారు ఆస్పత్రి చుట్టూ పది ప్రదక్షిణాలు చేశాడు వెంకట్రావు. యమదూతలకు అసలే భయంగా ఉంది ఇంకొక నాలుగు ఘడియలు ఆలశ్యమైతే తమ ఉద్యోగాలు ఊడిపోతాయి. ఆ భయంతో వాళ్ళు అసలే పరిగెత్తలేకపోయారు వాళ్ళ స్థితి కనిపెట్టిన వెంకట్రావుకు వాళ్ళ మీద జాలివేసింది చివరకు అలసిపోయి ఒకచోట చతికిలబడ్డారు యమదూతలిద్దరూ రొప్పుకుంటూ అతని వద్దకు వచ్చారు. వర్షం పడటానికి సిద్ధంగాఉన్న మబ్బుల్లా ఉన్నాయి వాళ్ళమొహాలు జాలిగా చెప్పాడు వెంకట్రావు వాళ్ళకు!

'అబ్బాయిలూ! మీరు బెదిరిస్తే మాత్రం నేనురాను నేను అందరిలాంటి వాడినికాను మర్యాద యిచ్చి పుచ్చుకోండి లేకపోతే పుచ్చుకొని యివ్వండి. అనవసరంగా ఎందుకు ఆయాసపడతారు నా దగ్గర డబ్బులుంటే చెరొక సోడా ఇప్పించే వాణ్ణే కాని నాకే లేకపోతే మీకేం ఇప్పించనూ! మీ యిష్టం వచ్చినట్లు జబర్దస్తీ చేస్తేమాత్రం నే న రా ను బె ది రిం చా రా ఏమూలకోపోయి దాక్కుంటాను మీరు నన్ను ఏలాగూ పట్టుకోలేరు అప్పుడు మీ ఉద్యోగాలు గోవిందకొడతాయి. మీరు చూడబోతే మరీ బీదవాళ్ళలా ఉన్నారు కనీసం చిన్న 'బంకు' అయినా పెట్టుకోటానికి స్తోమతు ఉన్నట్లులేదు అప్పుడు ఆకలితో మాడి చావవలసి వస్తుంది ఆకలితో మాడటం ఎంతో బాధ. మీరు చాలా సుకుమారుల్లా ఉన్నారు ఆ బాధలను ఓర్చుకోలేరు మీకు ఆకలిబాధ లేకుండా ఉండాలంటే మీ ఉద్యోగాలు మీకుండాలి. మీ ఉద్యోగాలు మీకుండాలి అంటె మీ పనులు సక్రమంగా చేయాలి. మీపనులు సక్రమంగా చేయాలి అంటే నన్ను పైకి తీసుకు పోవాలి. నన్ను పైకితీసుకు పోవాలి అంటే నే చెప్పినట్లు వినాలి చూశారా మరి! మీకు ఆకలిబాధ తప్పాలంటే నే చెప్పినట్లు వినాలి. ఆలోచించుకోండి ఆరోహణా, అవరోహణా లెక్కల్లాగా విడమర్చాడు వెంకట్రావు.

'బాబ్బాబు! నువ్వు చెప్పినట్లే వింటాం. మా ఉద్యోగాలు నీ చేతుల్లో ఉన్నాయ్. మాతోరా' వినయంగా విన్నవించుకున్నారు.

'అలారండి దారికి. నాపేరు వెంకట్రావు మీ పేర్లేమిటి' అని అడిగాడు.

'నాపేరు లంబూ. వీడిపేరు జంబూ' అందులో ఒకడు చెప్పాడు.

'ఇవేదో సినిమా పేర్లలాగా ఉన్నాయ్. అయినా ఎందుకులే, గ్లాడ్ టూ మీట్ యూ!' అంటూ చేయిచాపాడు

'మా కత్తులు నీకు దేనికి?' చాచిన చేయివంక చూస్తూ అడిగారు అనుమానంగా.

'మీ కత్తులు ఎవరడిగారు — ఓహో మీకు ఇంగ్లీషు రాదుకదూ ఖర్మ అయ్యా! లంబూ, జంబూ మీ కత్తులు నేనడగలేదు. మీ పరిచయమైంది అందుకు నేను చాలా సంతోషిస్తున్నాను అని అభినందనలు తెలుపుతున్నాను ఆ ఇంగ్లీషు పదానికి అలా చేయి చాచటానికీ అదీ అర్థం మీకు ఇంగ్లీషు రాకపోవడం పెద్దచిక్కే. తెలుగువాళ్లలో చదువురాని వాడు వచ్చినవాడు అంతా ఇంగ్లీషే ఎక్కువ ఉపయోగిస్తుంటారు తెలుగులో మాట్లాడటం నామర్దా అనుకుంటారు మరి మీ మహారాజుగారు, అంటే వారే యమధర్మరాజుగారు! వారడిగే ప్రశ్నలకు పాపులు జవాబులు చెప్తారుకదా! దాంట్లో ఇంగ్లీషే ఎక్కువ ఉంటుంది. మరి వారికి, మీకు ఎలా అర్థమౌతుంది' తన సందేహాన్ని వ్యక్తపరిచాడు.



'అవును స్వామీ! ఈ మధ్య అంటే దాదాపు 150 సంవత్సరాలనుండి అందరూ అదేమాట ఆ ఇంగ్లీషు మాట్లాడుతుంటే రాజుగారికి అర్థంకాక ఏ లాభం లేదని ఈ లోకంలోంచి ఒకదొరగారిని పిలిపించి ఇంగ్లీషు నేర్చుకున్నారు దాని కోసం కుబేరుని వారిదగ్గరనుండి వెయ్యి వెండిరూకలు అప్పు తీసుకున్నారు. చదువు పూర్తి కాగనే అతనిని మళ్ళీ భూలోకంలో వదిలిపెట్టారు' అని తక్కున ఆగిపోయి మళ్లీ కంగారుతో చెప్పాడు లంబూ.

'బాబూ! ఇప్పటికే చాలా ఆలశ్యమయింది త్వరగా రాకపోతే మా ఉద్యోగాలు ఊడిపోతాయ్' అని తొందరపడసాగారు

ముగ్గురూ గగనవీధులలో బయలుదేరారు దారిలో వెంకట్రావు అడిగాడు.

'అయితే మీవి టెంపొరరీ జాబ్సా?'

'అదిగో మళ్లీ ఇంగ్లీషు మొదలు పెట్టావ్'

'ఓహో! మరచిపోయాను మీ ఉద్యోగాలు తాత్కాలికమైనవా?'

'మరేనండి మేము చేరి ఇప్పటికి నూరు పితృదినాలే అయింది కనీసం 500 పితృదినాలైనా లేనిది ఖాయం కాదు'

'పితృదినమంటే ఎన్ని రోజులు?'

'పితృ దినమంటే తెలియదా? భూలోక లెక్క ప్రకారం ఒక పితృ దినమంటే ఒక సంవత్సరం' అన్నాడు జంబు

'పితృ దినమంటే తెలియని వాళ్ళున్నారా' అడిగాడు జంబు

'అంతకు మించిన వాళ్ళున్నారు 'దేవుడున్నాడా' అనే వాళ్ళు కూడా ఉన్నారు' అన్నాడు వెంకట్రావు.

'ఔరా!' అని ఆగిపోయి ముక్కుమీద వేలేసుకున్నారిద్దరూ ఒకేసారి

వేసుకున్న వేలు తీసేలోపల నరక ద్వారాలు సమీపించాయి. వెంకట్రావు ఒక్కసారి దేవుణ్ణి స్మరించుకున్నాడు. నరక ద్వారాలు దాటగానే ముందు వైతరణీ నది కనిపించింది. అది చూడటానికే అసహ్యంగా ఉంది అందులో ఉండే జనం పన్నెండు పుష్కరాలకు ఎంత మంది వస్తారో అంతకు పైనే ఉన్నారు.

అందరూ బాధతో మూలుగుతున్నారు. వాళ్లను చూసేసరికి వెంకట్రావుకు జాలితో పాటు భయం పుట్టింది. తను యమధర్మరాజుతో చేసే వాదనలో ఓడిపోతే తనకేలాంటి శిక్ష లభిస్తుందో? వెనక్కు తిరిగి పారిపోదామనుకున్నాడు. కాని పోయి మాత్రం ఏం చేస్తాడు ఎంత కాలం రూపహీనంగా తిరుగుతాడు ఇందాక యమదూతలను బెదిరించాడే గాని, నిజంగా వాళ్ళు వెళ్ళిపోతే వాళ్ల వెంబడే పోయే వాడు.

ఆలోచిస్తూ ముగ్గురు ముందరకు సాగారు. కొంత దూరం పోయాక భగ భగ మండే మంటల్లోకి నెట్టబడి లబో దిబో మని ఏడుస్తూ కొంతమంది కనిపించారు. వెంకట్రావు ఝల్లు మన్నాడు శరీరం కంపించింది. తనగతి ఏమవౌతుందో? అనుకుంటూ నెమ్మదిగా వెళ్ళుతున్నాడు వాళ్లను చూస్తూ. అందులో తనకు ముఖపరిచయమైన వాళ్ళు చాలా మంది ఉన్నారు. తనను మోసం చేసిన శెట్టి గూడా అందులోనే ఉన్నాడు. అతన్ని చూడగానే వెంకట్రావుకు కోపం ఆనందం కలిగాయి. ఆ దుర్మార్గుడికి అంతే శాస్తి కావాలి. ఎంతమందిని మోసం చేశాడు. ఎంత సరుకు బ్లాక్‌లో అమ్మాడు. ఇటువంటి వాళ్ళు పదిమంది ఉండబట్టే భారతదేశం ఆహార ధాన్యాల కోసం ఇతర దేశాల దగ్గర నుంచి అప్పులు తీసుకోవలసి వచ్చింది. నిజంగా ఇటువంటి వాళ్లే అసలు సిసలు దేశద్రోహులు.

'త్వరగా రావయ్యా స్వామీ' అన్న లంబూ పిలుపుతో ఈ లోకం లోంచి ఆ లోకం లోకి వచ్చి వాళ్లను అనుసరించ సాగాడు. దారిలో ఎన్నో ఘోరాలు కనిపించాయ్. ఎంతోమంది ఎన్నో రకాల బాధలతో గిలగిల్లా పోతున్నారు వాళ్లలో ఎక్కువ మంది ప్రముఖులే ఉన్నారు ఒక్కొక్కళ్లనుచూస్తుంటే వెంకట్రావుకు ఆశ్చర్యం వేసింది. అక్కడ ఉన్న వాళ్లలో చాలా మందిని భూమ్మీద ప్రజలు దేవుళ్లుగా తలచి పూజించారు అటువంటి వాళ్ళు నరకంలో ఉన్నారు

'అది సరేగాని, మీ నరక లోకంలో జనాభా చాలా ఎక్కువగా ఉందే' అన్నాడు వెంకట్రావు.

'అవును, రోజురోజుకూ ఎక్కువయి పోతుందే కాని తక్కువ కావటం లేదు.

యమలోకయాత్ర

స్వర్గం దాదాపు ఖాళీగా ఉంది అష్ట దిక్పాలకులు కాక ఎవరో ఇద్దరున్నారు. జనం లేక పోయేసరికి దిక్పాలకులకు కూడా బద్ధకం వేసింది. కార్తీకమాసం వెళ్లినా కూడా వానదేవుడు నిద్ర లేవలేదు సరే గాలి దేవుడ్ని ఎవరన్నా నిద్రలేపితే ఒక్కసారి గబగబా ప్రపంచం అంతా చుట్టేసి మళ్లీ వచ్చి పడుకుంటున్నాడు. అగ్ని దేవుడికి కూర్చొని, కూర్చొని విసుగు పుట్టి ఒక్కసారి భూలోక సంచారం చేసివస్తాడు. ఒకసారి భూమ్మీదకు పోయాడంటే మళ్లీ ఏ రెండు మూడు నెల్లకో గాని రాడు. స్వర్గంలో జనాభా ఉన్నట్టయితే తమ ప్రజలకు మేలు చేసేవాళ్లే కాని ఎవ్వరూ లేరు మహామునులంతా తపస్సు చేసుకోవానికి వెళ్లారు ఇప్పుడు త్రిమూర్తులు స్వర్గం కొన్నాళ్లపాటు తీసేసి నరకం యొక్క ఇంకొక శాఖను అక్కడ స్థాపిద్దామనుకుంటున్నారు ఈ విషయాన్ని గురించి భాద్రపద మాసంలో చర్చిస్తారట.'

వెంకట్రావు భాద్రపద మాసం ఎప్పుడు వస్తుందని అడుగుదామనుకున్నాడు. కాని ఇంతలోకే ఘంటారావం వినపడింది. అది న్యాయస్థానంయొక్క ఘంట ఆరోజు జనం ఎక్కువగా లేరు. కారణం ఆరోజు స్పెషల్‌రోజు కొద్ది పాపాలు చేసినవాళ్లకు మాత్రమే విచారణ జరుగుతుంది. ఒక పదిమంది కంటే ఎక్కువలేరు అందులో ఆఖరివాడు వెంకట్రావు.

న్యాయస్థానంలోకి వెంకట్రావును తీసుకువెళ్లారు యమన్యాయస్థానం అతను అనుకున్నట్లు భయంకరంగాలేదు సాధారణంగా ఉన్నది ముద్దాయిలు నిలుచోటానికి ప్రత్యేకించి బోనులేదు న్యాయమూర్తి ఎదురుగా నిలబడి మాట్లాడవచ్చు అది చాలా విశాలమైనగది. గదిలో దాదాపు 20 స్తంభాలు ఉన్నాయ్ ఒక్కొక్క స్తంభం దగ్గర ఒక్కొక యమదూత ఉన్నాడు ఆగది చూడగానే ప్రతి ఒక్కడికీ తాముచేసిన పాపాలమీద తమకే అసహ్యం పుడుతుంది. అయినా వాళ్ల అహంకారం నశించదు. ఏలాగైనా శిక్షపడకుండా తప్పించుకోవాలని చూస్తారు.

కాని వెంకట్రావుకు ఆవూహ కలులేదు తను మళ్లీ బ్రతకాలి వెంకట్రావుకు ఇదే ఆలోచన. అందరు పాపుల విచారణ అయింది. తానే చివరివాడు

'పారాయణం వెంకట్రావు' చిత్రగుప్తుడు గావుకేక పెట్టాడు. యమభటులు అతన్ని న్యాయపీఠంవద్దకి తీసుకువెళ్లారు. న్యాయపీఠానికి ఎదురుగ ఉన్న ఆసనంలో యమధర్మరాజు ఆసీనుడై ఉన్నాడు. మానవులు ఊహించినట్లు ఆయన భయంకరంగాలేడు. చిరునవ్వు ముఖంతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నాడు.

'బాబూ నీ పేరేమిటి? సౌమ్యంగా అడిగాడు యమధర్మరాజు వెంకట్రావు, ఆయన అలా మాట్లాడతాడని కలలోకూడా అనుకోలేదు. ఆయన కర్కశంగా ఉంటాడని. కఠిన హృదయుడని తను ఎన్నోసార్లు భూలోకంలో వినిఉన్నాడు కాని అతను అనుకున్నదానికి వ్యతిరేకంగా జరుగుతున్నది'

'వెంకట్రావు' నెమ్మదిగా జవాబు చెప్పాడు.

యముడు, చిత్రగుప్తుని వైపుకు తిరిగి, 'చిత్రగుప్తా! ఇతడు చేసిన నేరాలేమిటి?' అడిగాడు.

చిత్రగుప్తుడు జవాబు చెప్పాడు; 'ప్రభూ! ఇతడు నాలుగు వందలసార్లు అబద్ధం చెప్పాడు. వందమందిని మోసం చేశాడు లెక్కలేనన్ని చిన్నప్రాణాలను చంపాడు. అఖరుకు ఆత్మహత్య చేసుకున్నాడు

వెంకట్రావు ఆ ఆఖరిమాట వినేటప్పటికి కోపమొచ్చింది.

'ప్రభూ! ఈ చిత్రగుప్తునికి కొంచెం మతి చలించి ఉంటుంది. లేకపోతే నేను చనిపోయేటప్పుడు నిద్రమత్తులో జోగాడుతుంటాడు నేను ప్రమాదవశాన చనిపోయానుకాని ఆత్మహత్యకాదు.'

చిత్రగుప్తుడు వెంకట్రావు వంక ఉరుముతూచూశాడు. యమధర్మరాజుమాత్రం సౌమ్యంగానే, 'బాలకా! చిత్రగుప్తుని చిట్టాలో ఇంతవరకు ఎవ్వరూ తప్పుపట్టలేదు నీవు చెప్పింది తప్పైతే నీకు ఎక్కువ శిక్ష ఉంటుంది. చెప్పు ఎలా చనిపోయావ్!' అడిగాడు.

'ధర్మరాజ! నేను నిన్నటివరకు ఒక నిరుద్యోగిని నా తల్లిదండ్రులు ఈ

(63వ పేజీ చూడండి)

మధ్యనే అగ్నిప్రమాదాల్లో మరణించారు. అప్పటినుండి నేను ఏకాకిగానే బ్రతుకు తున్నాను బాచులర్ ఆఫ్ ఆర్ట్స్ అవి పించుకున్నాను. డిగ్రీవచ్చి నాలుగు సంవత్సరాలైంది. ఉద్యోగంకోసం ఎంతో ప్రయత్నించాను కాని ఏ రికమండేషన్ కాని లంచంగాని తేలేని నేను ఉద్యోగం ఎలా సంపాదించను. ఫస్ట్‌క్లాస్‌లో పాస యినా ఏం లాభం! బ్రతకటంకోసం కాఫీ హోటల్లో సర్వర్‌గా పనిచేశాను. కూలి వాడిగా బ్రతికాను. అయినా ఏ రోజూ పొట్టగడిచేదిగాదు. ప్రతిరోజూ ఏదో ఒక పూట పస్తు పడుకునే వాణ్ణి. ఆఖరికి నిన్న నా బాల్యమిత్రుడొకడు కనబడ్డాడు. అతడు పెద్ద కంపెనీకి మేనేజరు. నన్ను చూడగానే ఆప్యాయంగా పలుకరించి మాట్లాడాడు. నా స్థితితెలుసుకొని, నన్ను తన కంపెనీలో నెలకు 500 రూపాయల జీతంమీద మేనేజర్‌గా నియమించాడు. వచ్చేవారమే వచ్చి జాయి నవమన్నాడు. నా సంతోషం వర్ణనాతీతం. వాడికి మనసులోనే ఎన్నో థాంక్స్ చెప్పాను. చాలాసేపు పాతవిషయాలు మాట్లాడు కున్నాం. నిన్న మధ్యాహ్నం అర్జెంట్ పనుందంటూ వాడు ఊరికి వెళ్ళాడు. నిన్న సాయంత్రంవరకు హాయిగా నిద్ర పోయాను. అలా నిద్రపోయి బహుశా నాలుగు సంవత్సరాలై ఉంటుంది.

నిన్న సాయంత్రం. అదే భయంకర మైన సాయంత్రం. నాపాలిట ఆఖరు సాయంకాలం. అలా షికారుకని పార్కుకు వెళ్ళాను. ఎన్నో ఊహలు మెదిలాయ్ ఒక్కరోజులో ఎంత తేడా! మొన్న దమ్మిడీలేని బికారిని. నిన్న పెద్ద కంపెనీకి మేనేజర్ని. మొన్నటివరకు చని పోవాలని ప్రయత్నించిన నాకు, నిన్న ఉద్యోగం రావడంతో మళ్ళీ ఆశకలిగింది ప్రశాంతమైన జీవితం గడుపుదామను కున్నాను. రేడియోలో శ్రావ్యమైన సంగీతం వినబడుతూంది. వింటూ, రేడియోకు దగ్గరలో భావి గట్టుమీద కూచున్నాను ఏదో ఆలోచన మనస్సులో మెదలుతుంది. ఎంతసేపు కూచున్నానో నాకే తెలీదు. ఎక్కువసేపు కూచోటం వల్ల నడుమునొప్పి పుడుతోంది. బెంచి మీద కూచున్నానన్న ఊహలో ఆనుకుందా మని వెనక్కి ఒరిగాను. ఏ ఆధారం లేక

యమలోకయాత్ర

(52వ పేజీ తరువాయి)

పోవడంవల్ల భావిలో పడ్డాను. పడేటప్పుడు పెద్దకేకకూడా వేశాను, కాని చీకటి పడటంవల్ల పార్కులో ఎవ్వరూ లేరు ఇదే జరిగినకథ. దీనిని గురించే అక్కడ పోలీసులు ఆత్మహత్య అనుకున్నారు ఇక్కడ చిత్రగుప్తుడు అలాగే వ్రాశాడు. కావాలంటే విచిత్రగుప్తుని పుస్తకంలో చూడండి.' అని చెప్పాడు వెంకట్రావు.

చిత్రగుప్తుడు వెలవెల బోయాడు. వాడు చచ్చిపోయేటప్పుడు తను బ్రాకున కొని త్రాగుతున్న బ్రాందీ మైకంలో ఉన్నాడాయె! ఆ విషయం యమధర్మ రాజుకు తెలిస్తే ఇంకేమన్నా ఉందా?

'విచిత్రగుప్తా నీ పుస్తకంలో చూడు' అన్నాడు ధర్మరాజు

విచిత్రగుప్తుడు తన పుస్తకాలన్నీ తిరగేసి,

'మహాప్రభూ! ఇతడు చెప్పిందంతా నిజమే. ఇతడు ప్రమాదవశాత్తు చని పోయాడు. పైగా ఇంకొక విషయం. ఇతడు ఇప్పుడేపోవాలని 'అసలు చిట్టా'లో వ్రాయలేదు. 'రోజు చిట్టా'లో మాత్రం చిత్రగుప్తుల వారు వ్రాశారు ఇతని ఆయు ర్దాయం 83 సంవత్సరాలు ఉంది' అన్నాడు.

యమధర్మరాజుతో వాదన పెట్టుకో కుండానే తన పని అయిపోయిందను కున్నాడు వెంకట్రావు యముడు చిత్ర గుప్తునివైపు ఉరుముతూచూచి, 'నీపని తరువాత చూస్తాం' అని వెంకట్రావు వైపుతిరిగి, 'వెంకట్రావ్! నీ ధైర్యానికి మెచ్చుకున్నాం నీ ఆయుష్యం పూర్తిగాక ముందే నిన్ను తీసుకు వచ్చినందుకు చాలా విచారిస్తున్నాం నీ ఆయుష్యం ఇంకొక 6 సంవత్సరాలు పెంచుతున్నాం. నీవు మళ్ళా బ్రతకటానికి అనుజ్ఞ ఇస్తున్నాం' అంటూ చెయ్యి ఎత్తాడు.

మరుక్షణం, భూలోకంలో ఉన్న వెంకట్రావు శవం కదలటంచూసి అప్పుడే వచ్చిన 'ఒన్‌వేట్రాఫిక్ డాక్టర్', పోలీసులు కూడా ఆశ్చర్యపోయారు. ●

ఋతుక్రమం ఆలస్యమైతే?

విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన దేవిపిల్సు వాడండి

పూర్తికోర్సుప్యాకెట్టు 28 మాత్రలు వెల రు 11/-
సగంకోర్సుప్యాకెట్టు 14 మాత్రలు వెల రు 6/-
ప్రతిచోటదొరకును

దేవి పిల్సు ముఖ్యంగా ఆలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన, లేక ఆగిపోయినబహిష్టకు దేవిపిల్సు బాగుగ గుణమిచ్చును

1 అన్ని సందర్భములలోను శీఘ్రముగాను, అమోఘము గాను పనిచేయును
2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగించదు

MFRS SEENU & CO., MADRAS-21

ప్రఖ్యాత కెమిస్టులు మరియు డ్రగ్గిస్టు లందరివద్ద లభించును.

Advt. Permitted under G O. MS. No. 1121

కే. టి. కృష్ణమూర్తి ఆచార్యారిగారి

"మేల్‌మాయిల్ మందు"

నల్లరంగు, యెర్రరంగు పొడలు, దద్దులు గజ్జి, మరియు చెడ్డనీరు వ్యాపించినందున ఏర్పడు వినుగు పుట్టించు గుణములు మొదలగు

దీర్ఘకాల చర్మరోగములకు ఉత్తమ నివారిణి

వివరములకు

సిద్ధ డాక్టర్ కే టి. కృష్ణమూర్తి ఆచార్యారి & సన్సు

5/22, మేల్‌మాయిల్, (P O) N A Dt